అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు సీఎం వైఎస్ జగన్

గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడంలో దేశానికే జగనన్న ఆదర్శంగా నిలుస్తున్నారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నల్లగుట్టపల్లె గ్రామ పంచాయతీలో గడప గడపకు కార్యక్రమాన్ని శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించారు. బీసీ కాలనీ, నల్లగుట్టపల్లె కస్బా, కొత్తపల్లెలలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఎమ్మెల్యేకి ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు, అపూర్వ ఆదరణ లభించాయి. సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్రలా నిలిచిపోయాయన్నారు. మరో మారు జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజాదరణలో తండ్రికి మించిన తనయుడిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారన్నారు. బీసీల హృదయంలో జగన్, జగన్ హృదయంలో బీసీలు ఉన్నారన్నారు.

బీసీ కాలనీలో ఆత్మీయ స్వాగతాలు

బీసీ కాలనీలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి వడ్డెరలు ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికారు. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే కానీ, తమ సంక్షేమానికి ఏమాత్రం కృషి చేయలేదని వడ్డెరలు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట గుర్తుకు చేసుకున్నారు. బీసీలంటే బ్యాక్ బోన్ కాస్ట్ అని, బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, బీసీలంటే వెన్నెముక అని సీఎం జగన్ నిరూపించారని వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, వైస్ ఎంపీపీ రవివంకర్‌రెడ్డి, హస్తకళల డైరెక్టర్ హుస్సేన్, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, సూరం వెంకటసుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆకేపాటి ఐ క్యాంప్‌లో కంటి ఆపరేషన్లు

ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ అమరనాథరెడ్డి



ఆపరేషన్‌లు చేయించుకున్న వారి యోగ క్షేమాలను ఆరా తీస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం నుంచి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, వల్లూరు మాధవీలత – రమేష్‌రెడ్డిల సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి పొర చికిత్స శిబిరంలో గురువారం ఆపరేషన్‌లు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ఆపరేషన్ నిర్వహించే బస్సుల వద్ద పూజలు చేసి ప్రారంభించారు. ఆకేపాటి ఎస్టేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి మూడు పర్యాయాలు భోజనం ఏర్పాటు చేయటంతో పాటు వారికి ప్రత్యేక వసతులను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి కల్పించారు. ఇప్పటికి వరకు వందల మందికి పరీక్షలు చేయగా, ఆపరేషన్‌లు అవసరమైన వారికి గురువారం నుంచి ఆపరేషన్‌లు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ తెలియజేశారు. చూపులేని వారికి చూపు తెప్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపినేని విశ్వనాథరెడ్డి, పోలీ మురళీరెడ్డి, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, అరిగెల సౌమిత్రి, మల్లికార్జునరెడ్డి, అరిగె బాబు, కంటి వైద్య నిపుణులు వెన్నపూస చంద్రశేఖర్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్, పిల్లి పిచ్చయ్య, శంకర నేత్రాలయ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మండల సమావేశం నేడు

సిద్దవటం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.00 గంటలకు వెలుగు కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన అన్నారు. అలాగే మండలంలోని అన్ని శాఖలకు సంబంధించి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

హిందీపై మక్కువ కలిగేలా బోధించండి

పుల్లంపేట : హిందీ భాష పట్ల మక్కువ కలిగేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలని ఎంఈఓ చక్రధర్ రాజు సూచించారు. గురువారం మండల పరిధిలోని పీవీజీపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో హిందీ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని మండల విద్యాధికారులు చక్రధర్ రాజు, నాగ తిరుమలరావులు పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ హిందీ భాష పట్ల విద్యార్థులకు భయాన్ని పోగొట్టి భాషపై మక్కువ కలిగేలా బోధించాలని సూచించారు. డిజిటల్ బోర్డు సహాయంతో పాఠానికి సంబంధించినటువంటి చిత్రాలు, కవులు, రచయితలను చూపించి బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సముదాయ చైర్మన్ కృష్ణవేణి, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటాయపల్లెలో ఉచిత వైద్య శిబిరం

సిద్దవటం : మండలంలోని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటయాపల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీరంగ లక్ష్మి వైద్య పరీక్షలను చేసినట్లు సిద్దవటం సబ్ యూనిట్ అధికారి ఐ.సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలు వచ్చిన వారందరికి రక్త పరీక్షలు నిర్వహించారని, అందరికీ కూడా నెగిటివ్ వచ్చిందన్నారు. గ్రామంలో ప్రతి ఇల్లు తిరిగి లార్వా సర్వే, ఫీవర్ సర్వే నిర్వహించామన్నారు. అలాగే దోమలకు నిలయమైన ప్రదేశాల్లో ఏఎల్ఓ ఆపరేషన్ చేసి అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేశామన్నారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ, ఎంపీహెచ్‌ఎస్, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కనీస అవసరాలు తీర్చాలి

రాయచోటి అర్బన్ : పారిశుధ్య కార్మికుల కనీస అవసరాలను అధికారులు వెంటనే తీర్చాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన రాయచోటి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత నేల పాటి శ్రీనివాసులుతో కలసి మున్సిపల్ కార్మికుల నుంచి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కనీస అవసరాలైన గ్లౌజులు, మాస్కులు, కొబ్బరినూనె, సబ్బులు, శానిటైజర్లు, పనిముట్లు, యూనిఫాం తదితరాలను అధికారులు కరోనా విపత్కర పరిస్థితుల కంటే ముందే పంపిణీ చేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటికి రెండేళ్ళు గడుస్తున్నా కనీస అవసరాలను తీర్చలేదన్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే కార్మికుల కనీస అవసరాలను తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుల్లయ్య, మహేష్, సుజాత, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కూలింగ్ వాటర్ యంత్రం వితరణ



యంత్రాన్ని పాఠశాలకు అందిస్తున్న దాత

పుల్లంపేట : మండల పరిధిలోని బావికాడపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చల్లని తాగునీరు అందించేందుకు గురువారం టి.రామసుబ్బమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు నరసింహులు పాఠశాలకు కూలింగ్ వాటర్ యంత్రాన్ని అందించారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతం చేస్తున్న మహిళలు

నందలూరు (రాజంపేట) : టీటీడీ హిందు ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణపౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని అరవపల్లెని శ్రీ కృష్ణా గీతా మందిరంలో గురువారం సాముహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపి, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ, మందిరం వ్యవస్థాపకులు గెలివి రత్నంశెట్టి, రిటైర్డ్ తహసీల్దారు నాయనపల్లె జయన్న, చిన్నసుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజంపేట సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పాల్గొన్నారు.

వంతాటిపల్లెలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లెలో గురువారం మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రైతులకు వరి పంటను ఆశించే పురుగులు, తెగుళ్లపై అవగాహన కల్పించామన్నారు. సాలీడు, గొల్లబామ, అల్లిక రెక్కల పురుగులు, కందిరీగ, తూనీగ, పొడుగు మీసాల మిడుత, మిరిడ్ నల్లి, వంటి మిత్ర పురుగులను గురించి వాటి వలన కలుగు ప్రయోజనాలను వివరించామన్నారు. ప్రతి గురువారం క్రమం తప్పకుండా పొలంబడిలో రైతులు పాల్గొనాలని, రైతులు తన పొలంలో తన నిర్ణయం స్వయంగా తీసుకునేలా తయారు చేయడం ఈ పొలంబడి ముఖ్య ఉద్దేశమన్నారు. వరిలో చీడ, పీడల నివారణ చర్యలను తెలియజేశారు. అనంతరం స్వచ్ఛ గణేష్ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం సహాయకులు మేకల ప్రేమ్‌కుమార్, ఎల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

- పారదర్శకతతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన
- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమాన్ని వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో గ్రామాల్లోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతూ కుటుంబంలో సంక్షేమ కాంతులినుతున్నాయని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు గురువారం తెలిపారు. మండలంలోని ఓబనపల్లి పంచాయతీలో సచివాలయం 1 పరిధిలోని హరిజనవాడలో గడప గడపకు తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేటి వరకు అవినీతికి చోటు లేకుండా నిబద్ధతతో పారదర్శకంగా పాలన చేస్తూ ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. నియోజకవర్గంలో ప్రతి చోటా జగనన్నకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ విప్ కొరముట్ల ఓబనపల్లి హరిజనవాడలోని ప్రజాసమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. విద్యుత్ స్తంభాలను మార్చాలని తెలియజేయగానే అధికారులకు ఫోన్ చేసి తగిన ఏర్పాట్లు చేశారు. సీసీ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఓబనపల్లి పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, ఉప సర్పంచ్ శివసాయి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సీహెచ్ రమేష్, చంద్రరాజు, సర్పంచ్ శ్రీరాం వినోద్, కరీముల్లా, రమణారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో సంచార జాతుల విముక్తి దినోత్సవం

లక్కిరెడ్డిపల్లె : సంచార జాతుల కులాలలో ఒకటైనటువంటి దొమ్మర కులం నాయకులు అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాయదుర్గం హరికృష్ణ, రాయదుర్గం రాజశేఖర్‌లు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడి ఆధ్వర్యంలో గురువారం లక్కిరెడ్డిపల్లెలో సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాయదుర్గం హరికృష్ణ మాట్లాడుతూ 71వ సంచార జాతుల విముక్తి దినోత్సవం అనగా ఆనాడు భారతావని బ్రిటీష్ వారి కబంధ హస్తాలలో చిక్కుకొని విలవిలలాడుతున్న తరుణంలో స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలను ప్రారంభించి, ఒక ఉద్యమ రూపంలో జరుగుతున్న సమయంలో సుమారు 200ల సంచార కులాలు ఏకమై భరతమాత విముక్తి కోసమై నడుంబిగించి 1857 ప్రథమ స్వాతంత్ర సంగ్రామం మొదలు కావడంలో కీలకపాత్ర పోషిస్తూ బ్రిటీష్ వారిని ధైర్యంగా ఢీ కొట్టి నిలబడి నిజమైన స్వాతంత్ర సమరయోధులు ఈ సంచార జాతులు అని నిరూపించుకున్నారన్నారు. సభ్యులు ఆర్ రెడ్డయ్య, ఆర్ వెంకటరమణ, చలపతి, శ్రీను, శివకుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచానికి ఆదర్శం



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామాపురం : చంద్రయాన్-3 విజయవంతంతో శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందనే మండల విద్యాశాఖాధికారి రామకృష్ణుడు అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం చంద్రయాన్-3 విజయవంతంపై విద్యార్థులలో దేశభక్తి పెంపొందించడానికి భారత శాస్త్రవేత్తలు కృషిని అభినందిస్తూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ప్రోత్సహించడానికి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు ఉర్దూ పాఠశాలలో హెడ్ మాస్టర్లు సుజాతమ్మ, హిలాల్ అహ్మద్, తెలుగు మీడియం పాఠశాల పీడీ నరేంద్ర కుమార్‌రెడ్డి, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ



రాజంపేట టౌన్: ఆర్డీఓ రామకృష్ణారెడ్డికి రాఖీ కడుతున్న విద్యార్థినులు



చిట్వేలి: చిన్న పిల్లలకు రాఖీలు కట్టిస్తున్న సీడీపీఓ రాజేశ్వరి తదితరులు

రాజంపేట టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం రాఖీ పండుగను అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. అనేక మంది ఇళ్లల్లో రాఖీ వేడుకను సందడిగా చేసుకున్నారు. అన్నలకు చెల్లెల్లు, తమ్ముళ్లకు అక్కలు రాఖీ కట్టి మిఠాయిలు పంచుకున్నారు. ఇదిలావుంటే పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం పాఠశాల విద్యార్థినులు ఆర్డీఓ రామకృష్ణారెడ్డికి, డీఎస్పీ వీఎస్‌కే. చైతన్యకు రాఖీ కట్టి వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. విద్యార్థులు మంచి ఆలోచనా దృక్పథంతో ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆర్డీఓ, డీఎస్పీ విద్యార్థులకు సూచించారు.

చిట్వేలిలో..

చిట్వేలి : సృష్టిలో అన్నా చెల్లి, అక్కా తమ్ముడు అను బంధానికి ప్రతీక రాఖీ పండుగ అని సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని నక్కలపల్లిలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యార్థులకు రాఖీలు కట్టించి మిఠాయిలను పంపిణీ చేశారు. ప్రాచీన సంప్రదాయాల కొనసాగింపు, పిల్లల మానసిక పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో వసుందరమ్మ, విమల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు నిష్పక్షపాతంగా ఉండాలి

చిట్వేలి : ఓట్ల తొలగింపు నిష్పక్షపాతంగా జరుగుతోందని జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. గురువారం చిట్వేలి మండలంలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల ప్రక్రియను తహసీల్దార్ శిరీషాతో కలిసి ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 2022 జనవరి నుంచి మార్చి 2023 వరకు వివిధ కారణాలతో 2130 తొలగించిన ఓట్లను ఆయన గ్రామాలకు వెళ్లి విచారించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

సమస్యలపై వాడీవేడీగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధికారులకు తెలిపారు. గురువారం ఉదయం మున్సిపల్ సభా భవనంలో చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలంటూ సూచించారు. పారిశుధ్య పనులకు ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పట్టణంలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డులో డ్రైనేజీ కాలువల నిర్మాణం పనులపై సభ్యులు చర్చించారు. ఆ రోడ్డులో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం జరిగింది కదా మళ్ళీ కాలువల నిర్మాణం ఎందుకంటూ సభ్యులు కొలిమి చాన్‌బాషా అధికారులను ప్రశ్నించారు. ఏఈ వెంకటక్రిష్ణారెడ్డి సమాధానమిస్తూ భూగర్భ డ్రైనేజీ ఉన్నా వర్షపు నీటి కోసం కాలువలు నిర్మించక తప్పదన్నారు. పట్టణం నడిబొడ్డున లక్షలాదిమంది సంచరించే ఠాణా వద్ద రోడ్డు, డ్రైనేజి కాలువల నిర్మాణం చేపట్టకపోగా సుద్దలవాండ్లపల్లె మార్గంలో పనులు చేపట్టడం తగదని సభ్యులు అల్తాఫ్,చాన్‌బాష, గౌస్‌ఖాన్‌లు అన్నారు. ప్రజావసరాలు ఎక్కువగా ఉన్నచోటే అభివృద్ధి పనులు చేపట్టాలంటూ వారు డిమాండ్ చేశారు. ఠాణావద్ద సుండుపల్లె మార్గంలో జరుగుతున్న రోడ్డు ఆక్రమణల తొలగింపులో తీవ్ర ఆలస్యం తగదన్నారు. వెంటనే పనులు పూర్తిచేయించాలంటూ కౌన్సిలర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానం ఇవ్వాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు సభకు గైర్హాజరు కావడంతో సభ్యులు మండిపడ్డారు. త్వరలో పనులు పూర్తిచేయిస్తామంటూ కమిషనర్ సమాధానం ఇచ్చారు. పట్టణంలో చేపట్టి పూర్తిచేసిన అభివృద్ధి పనులకు వెంటనే పనులు బిల్లులు చెల్లించాలంటూ సభ్యులు కోరారు. కమిషనర్ గంగాప్రసాద్ సమాధానమిస్తూ సాంకేతిక సమస్యల కారణంగా బిల్లుల చెల్లింపు ఆలస్యమవుతోందని, త్వరగా బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సక్రమంగా పనిచేయని వార్డు కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వార్డు సెక్రటరీలతో సక్రమంగా పనిచేయించాలంటూ కమిషనర్‌కు సూచించారు. పట్టణంలో ఇష్టారాజ్యంగా తిరుగుతున్న జంతువులపై చర్యలు తీసుకోవాలంటూ వైఎస్ఆర్‌సీపీ నేత ఫయాజ్ అహమ్మద్ కోరారు. ప్రజలకు అత్యవసరమైన ప్రభుత్వాసుపత్రి పనులను వేగవంతంగా పూర్తిచేయించాలంటూ మున్సిపల్ చైర్మన్ వైద్యశాఖ అధికారులకు తెలియజేశారు. పట్టణంలో దోమల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలంటూ సభ్యులు ముక్తకంఠంతో అధికారులను కోరారు. అనంతరం తమకు జీతాలు చెల్లించాలంటూ 7 మంది మున్సిపల్ వర్కర్లు హైకోర్టును ఆశ్రయించడంపై సభలో చర్చించారు. సమావేశం పూర్తయ్యాక మున్సిపాలిటీ ఇటీవలే కొనుగోలు చేసిన నూతన జేసీబీకి చైర్మన్, సభ్యులు పూజలు చేసి ప్రారంభించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, సభ్యులు రౌనఖ్ హుస్సేన్, ఎస్‌పీఎస్ జబీవుల్లా, ఈశ్వర్ ప్రసాద్, సాదక్‌అలీ, ఆసిఫ్ అలీఖాన్, వైఎస్ఆర్‌సిపి నేతలు బుజ్జిబాబు, కాలనీరవి, పింఛా భాస్కర్, జీఎండి ఇర్షాద్, పల్లారమేష్, ఇర్ఫాన్, రియాజ్, షబ్బీర్ అహమ్మద్, హజరత్ ఖాదర్‌వలీ, ఆనందరెడ్డితో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన చౌడేశ్వరమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

పెనగలూరు : మండలంలోని తూర్పుపల్లెలో రెండు రోజులపాటు జరిగే చౌడేశ్వరమ్మ జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. జాతరను పరస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నిర్మించి 25 సంవత్సరాలు కావడంతో ఈ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించి విద్యుత్ కాంతులు వెదజల్లేలా సుందరీకరించారు. గురువారం రాత్రి గ్రామోత్సవం, శుక్రవారం ఉదయం పొంగుబాళ్లు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయనున్నట్లు వారు తెలిపారు.

గంగమ్మకు పొంగుబాళ్లు

అదే గ్రామంలో కొలువైన గంగమ్మకు గురువారం ఘనంగా పొంగుబాళ్లు నిర్వహించారు. ఆసాధులచే గంగమ్మతల్లికి ముద్దపెట్టి దీవెనలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏడు రంగులతో ఆలయం ముందు గంగమ్మ ప్రతిమను సుందరంగా ఏర్పాటు చేశారు. గ్రామం మొత్తం పొంగుబాళ్లు పొంగించారు.

ఇంటి పట్టాలు కేటాయించండి

ఓబులవారిపల్లె : ఇంటి స్థలం, భూములు లేని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కుటుంబాలకు భూములు, ఇంటిపట్టాలు కేటాయించాలని బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి తహసీల్దార్ పుల్లారెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీకేఎంయూ సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పండుగోల మణి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు నిరుపేదలకు ఒక సెంటు భూమిని పంచలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కులమతాలకు అతీతంగా నిరుపేదలకు ప్రతి కుటుంబానికి ఒకటిన్నర ఎకరాచొప్పున భూమిని పంపిణీ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 8వ విడత భూ పంపిణీ చేస్తున్నారని, ప్రభుత్వ బంజరు భూములను, కబ్జాలను తొలగించి స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీకేఎంయు రైల్వే కోడూరు నియోజకవర్గ సభ్యురాలు హాజీమా, నరసింహులు, చిన్న నరసయ్య, చిన్న నరసమ్మ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులను వేటాడితే చర్యలు



అటవీ ప్రాంతాలను పరిశీలిస్తున్న రేంజర్ కళావతి, సిబ్బంది

సిద్దవటం : అటవీ ప్రాంతంలోని వన్య ప్రాణులను వేటాడితే వారిపై కఠిన చర్యలు తప్పవని రేంజర్ బి. కళావతి హెచ్చరించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ వేటగాళ్లు అటవీ జంతువులను వేటాడుతున్నారన్న సమాచారంతో సిద్దవటం రేంజ్‌లోని శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానం, పంచలింగాలు, వనేశ్వరం ప్రాంతాలను గురువారం తన సిబ్బందితో వెళ్లి పరిశీలించామన్నారు. అటవీ ప్రాంతాల్లోని జంతువులు, పక్షులు, అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వర్షాభావం కారణాల వల్ల వన్యప్రాణులు నీటి కోసం గ్రామ శివారులోని పొలాల్లోకి వస్తున్నాయని, వాటికి ప్రజలు హాని కల్గించకుండా అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని రేంజర్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లంకమల అభయారణ్యంలో ఏకో టూరిజం

లంకమల అభయారణ్యం లోని పలు ప్రాంతాల్లో ఏకో టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రేంజర్ బి. కళావతి తెలిపారు. మండల కేంద్రంలోని అటవీ శాఖ అధికారి కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ లంకమల అభయారణ్యంలోని శ్రీ నిత్యపూజ స్వామి కోన, పంచలింగాలు, వనేశ్వరం, కపర్దీశ్వర స్వామి కోన, గోపాలస్వామి కొండ, సాలంక, లంకమల, మల్లెంకొండ, భైరవకోన, నాగేశ్వర కోన, తాత వీరులు వంటి ప్రదేశాల్లో ఏకో టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ట్యాబ్‌ల వినియోగంతో నాణ్యమైన విద్య

సంబేపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల వినియోగం వలన నాణ్యమైన విద్య సమకూరుతున్నదని, విద్యా ప్రమాణాలు పెంపొందుతున్నాయని అన్నమయ్య జిల్లా బైజూస్ నోడల్ ఆఫీసర్ చిట్లూరి సుధాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాబ్‌లో ఇచ్చిన కంటెంట్ తప్ప ఇంటర్నెట్ కంటెంట్‌ను అప్‌లోడ్ చేసేందుకు, డౌన్‌లోడ్ చేసేందుకు అవకాశం లేకుండా ట్యాబ్‌ల సాఫ్ట్‌వేర్‌ను రూపొందించామన్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్ల కొందరు విద్యార్థులు యాప్‌లను డౌన్‌లోడ్ చేసేందుకు ప్రయత్నించడంతో కొన్ని ట్యాబ్‌లలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తి పని చేయడం లేదన్నారు.

ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పుడు అన్ని ట్యాబ్‌లలో సెక్యూరిటీని అప్‌డేట్ చేశామన్నారు. విద్యార్థులు ఎలాంటి మార్పులు చేసిన పాఠశాల సిబ్బంది తెలుస్తుందన్నారు. ట్యాబ్‌లలో ఏవైనా మరమ్మతులు అవసరమైతే సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, జిల్లా అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.